



# నిజాయితీ నీ విలువెంత ?

-'కృప'

**రామారావు** ఆదివారం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడని రోజు ఉండదు. ఆ రోజు ఉదయమే లేచి గడ్డం గీసుకోవాల్సిన పని లేదనీ, హడావుడిగా ఎనిమిది గంటలకే భోజనం చేసి ఆ నిండు కడుపుతో పరుగెత్తుకుంటూ ఆఫీసుకి చేరుకోవాల్సిన అవసరం ఉండదనీ-అదే జీవితంలో చాలా పెద్ద సుదినమనీ భావిస్తూ ఉంటాడు.

ఈ ఆదివారం-

హాయిగా తనివితీరా నిద్రపోయాడు. లేచేటప్పటికే ఉదయం పది గంట లైంది. నింపాదిగా పనులు చూసుకుంటూ టిఫిన్‌కి బయలు దేరేటప్పటికి పన్నెండైంది.

చిక్కడపల్లి వీధి ఎప్పుడు చూసినా అదే విధంగా ఉన్నా, ఆదివారం ఇంకాస్త ఉల్లాసంగా కనిపించటం మామూ లే. ముందు చూపే తప్ప వెనక్కు తిరిగి చూడకపోవడంవల్ల ఎవరో కొద్దిగా వెనుకగా వస్తూ తనతో మాట్లాడటానికి ప్రయత్నం చేయడం రామారావు గమనించలేదు.

"ఎక్స్క్యూజ్ మీ, సర్!" అం దా శాల్తీ జాలి గొంతుతో.

"సిటీల్లో ఇటువంటి వ్యక్తులు మామూ లే. పైగా పేదవాళ్ళందరూ దేశానికి నష్టకారకులే అని నమ్మే రామారావుని ఏ మాత్రం కదిలించలే దా కంఠం.

కానీ, అవతలి వ్యక్తి ఆ మాత్రానికే నిరుత్సాహ పడేలా లేదు.

"ఎక్స్‌క్యూజ్ మీ, సర్!" అంటూ ఇంగ్లీషులో మాట్లాడాడు అతను. "మీ సహాయం కావాలి, సార్! మాది విజయవాడ. నా సామాన్లన్నీ బస్సులో దొంగిలించారు, సార్!"

ఘరానాగా అడుక్కోవడం అంటే ఇదే కాబోలు. దానికి తోడు బోడి ఇంగ్లీషొకటి. కానీ, ఏ మాట కామాటే చెప్పుకోవాలి. తప్పుల్లేని ఇంగ్లీషు!

తెలుగులో వినగ్గా-"నా మానాన నన్ను వదిలి పెడతావా, బాబూ. నన్నెంత బతిమిలాడినా నీకు పైసాకూడా ఇవ్వను" అంటూ ముందుకు పోబోయాడు.

"చాలా ఇబ్బందుల్లో ఉన్నాను, సార్! మీ లాంటి చదువుకున్న వారు తప్ప ఎవరు సహాయం చేస్తారు?" రామారావు హుందాతనాన్నీ, నిశ్చింతగా బతుకుతున్నా డన్నందుకు ప్రతీకగా ఉన్న అతని మంచి డ్రెస్‌నీ పరిశీలిస్తూ అన్నాడతను.

మళ్ళీ ఇంగ్లీషులో బోరితే ఎట్లా ఉండేదో కానీ, చక్కటి తెలుగు మాట్లాడేటప్పటికి రామారావు చల్లబడ్డాడు. పైపెచ్చు అవతలి మనిషి బలహీన పరిస్థితిని గూర్చి కొద్దిగా ఇబ్బంది పెడదామని కోరిక కలిగింది.

## అదీసంగతి



గెలిచాక ఇక ప్రజాసేవ చేస్తాం అనేమాట ఎక్కడా వాడకండిసార్.. సర్లేవయ్యా.... నువ్-చెప్పాలా..,

పొడిగా-"నే నెలాంటి హెల్పూ చేయను. నన్ను విసిగించకు" అన్నాడు.

"నే నింతవరకూ ఇట్లా ఎవరి ముందూ చేతులు చాచి అడుక్కో లేదు, సార్! ఈ రోజు అడక్క తప్పటల్లేదు. బస్సు సూర్యాపేటలో ఆగినప్పుడు టాయ్‌లెట్‌కి వెళదామని దిగాను. ఎంతో సేపు లేదు. అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చి చూసుకునే టప్పటికి నా సామాను పోయింది. అదృష్టవశాత్తు జేబులో ఒక రూపాయి, బస్సు టికెట్టు మాత్రం మిగిలాయి. ఇక్కడి నా పని ఎట్లాగూ కాదు. తిరిగి ఇంటికి చేరుకోవటానికి దారి లేదు. ఆ రూపాయితో ఎట్లాగోట్లా నిన్న కడుపు నింపుకొన్నాను. పొద్దుట్నించీ చాలామందిని అప్రోచ్ అయ్యాను. ఎవరూ సహాయం చేయలేదు, సార్! మీరైనా కాస్త సహాయం చెయ్యాలి, సార్! కనీసం మీ కేరాఫ్ అడ్రసుతో మాఅన్నయ్యకు టెలిగ్రామ్ ఇచ్చారంటే రేపటికల్లా డబ్బు వచ్చేస్తుంది. అదీ మీ కిష్టమయితేనే లెండి. నిన్నట్నించీ తిండి లేకుండా ఉన్నాను. ఈ పూట భోజనానికి, వీలైతే బస్సు చార్జీలు ఇప్పించారంటే నే నింటికి చేరిన వెంటనే పంపేస్తాను. నేను మీ రనుకుంటున్న బిచ్చగాణ్ణి కాదండీ. సయాపైసల్తో సహా తిరిగి ఇచ్చేస్తాను. తప్పకుండా హెల్ప్ చేయాలి, సార్, ప్లీజ్" అంటూ అభ్యర్థిస్తుంటే నిజంగా అతని కథ నిజమేనేమో అనిపించింది రామారావుకి.

"నీ కిక్కడ తెలిసినవా రెవరూ లేదేమిటోయ్?" అన్నాడు.

"అట్లాంటి వారెవరూ లేరండీ. వరంగల్‌లో మా బంధువు ఒక డున్నాడు. మీరు చార్జీలు బెజవాడ వరకూ ఇవ్వక్కర్లేదు. పోనీ వరంగల్ వరకూ సర్దారంటే చాలు. మీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేను. మీ కంత అనుమానంగా ఉంటే టెలిగ్రామ్ చార్జీలయినా ఇవ్వండి, సార్! దగ్గర్లో పోస్టాఫీసు కానీ, టెలిగ్రాఫ్ ఆఫీసు గానీ ఉందా, సార్!" అన్నా డతను.

'నిజంగా మోసం చెయ్యదల్చుకుంటే టెలిగ్రామ్ అనడు కదా' అనిపించింది రామారావుకి.

ఒక నిశ్చయానికి వచ్చాడు రామారావు.

"పద... టెలిగ్రామ్ ఇద్దాం మీ బ్రదర్‌కి" అంటూ టెలిగ్రాఫ్ ఆఫీసు వైపుకి దారి తీశాడు.

"మీ అడ్రసు వివరంగా వ్రాయాలండీ. నా పరిస్థితి వాడికి అర్థమవ్వాలంటే కాస్త డీటైల్డ్‌గా వ్రాయాలి, కదండీ. ఇదంతా కలిపితే చాలా అవుతుందేమో చూడండి, సార్! అదే డబ్బు నాకిచ్చారంటే... ఒక పది రూపాయ లనుకోండి... సరాసరి వరంగల్ వెళ్ళే అవకాశం ఉంటుంది, సార్" అన్నా డతను నడుస్తూనే.

అదీ పాయింటే. రామారావు తన ఇంటి అడ్రెను టెలిగ్రామ్ మేటర్‌లో ఊహించుకున్నాడు. పైగా టిఫిన్ ఆలస్యం అయినందువల్ల కడుపులో మాడుతూంది.

'రిస్క్ తీసుకుని ఒక పది రూపాయ లిస్తే... నిజంగా అవసరంలో ఉన్నట్లయితే తిరిగి పంపేస్తాడేమో చూద్దాం' అనుకుని పర్సులో నుంచి రెపరెపలాడే పది రూపాయల కాగితాన్ని అతనికిస్తూ, "నా ఖర్మ. నేనే దొరికాను కాబోలు నీకు" అన్నాడు.

ప్రస్తుతానికి పెద్ద బరువు దించినట్లుగా నిట్టూరుస్తూ అతను-"మెనీ మెనీ థాంక్స్, సార్! నా పేరు మోహన్. డబ్బు తిరిగి పంపించేందుకు మీ అడ్రెస్ ఇస్తారా?" అన్నాడు.

అతని సిన్సియారిటీని చూసి రామారావుకి, ఇతను చెప్పిన మాట నిజంగానే నిలబెట్టుకుంటాడనిపించింది. అడ్రెను సిగరెట్టు పెట్టె అట్టమీద వ్రాయాల్సి వచ్చింది.

పదే పదే థాంక్స్ చెబుతూ కృతజ్ఞతలు కళ్ళల్లో కురిపిస్తూ వెళ్ళిపోయా డతను.

ఓ పది రోజులపాటు ఎటువంటి దానాలూ చేయకూడదని నిశ్చయించుకున్నాడు రామారావు. ఆఖరికి ఖర్మ కాలి ఈ పది రోజుల్లో ఏ కొలీగ్ పెళ్ళి జరిగినా చందాకూడా ఇవ్వదల్చుకోలేదు.

×× ×× ××

పదేళ్ళు గడిచాయి. మోహన్ దగ్గర్నించి డబ్బు కాదు కదా కనీసం ఉత్తరం ముక్కయినా రాలేదు.

రామారావు ఓ సంసారి అయ్యాడు. ఇద్దరు పిల్లలుకూడా పుట్టారు. పెద్దమ్మాయికి అప్పుడే ఐదేళ్ళు నిండాయి.

×× ×× ××

"ఎవరో మోహన్‌ట! చూడండీ ఉత్తరం" అంటూ ఒక ఇన్లాండ్ లెటర్ రామారావు చేతిలో పెట్టింది సుశీల.

మోహన్ ఎవరబ్బా అనుకుంటూ చదవసాగాడు రామారావు. పైగా అది రీ డైరెక్ట్ చేసిన ఉత్తరం.

"పూజ్యులు శ్రీ రామారావుగారికి,

నా సంగతి మీరు మర్చిపోయి ఉంటారు. చిక్కడపల్లిలో ఒకానొక రోజున మీకు కల్ల బొల్లి కబుర్లు చెప్పి, మోసం చేసి పది రూపాయలు ముట్టెత్తుకున్న వ్యక్తిని నేనే, సార్! ఈ పాటికి గుర్తొచ్చానని ఆశిస్తాను.

అప్పట్లో దరిద్రం అంతా నా తోనే ఉండేది. అమ్మా, నాన్నల తాహతుకు మించిన గ్రాడ్యుయేషన్ చేసాను. నా చదువు కోసం వారి యావదాస్తినీ ధారపోసారు పాపం పిచ్చి తల్లిదండ్రులు. వెంటనే ఉద్యోగం వస్తుందని ఊహించుకున్నాను.

ఇటువంటి కథలు పత్రికల్లోనూ, సినిమాల్లోనూ నిజ జీవితంలోనూ కోకొల్లలుగా మీరు చూసే ఉంటారు. అయినప్పటికి నా కథ చెప్పుకుంటేనే నాకు తృప్తి. బోరు కొడుతున్నా నంటారా?

ఈ దేశంలో ప్రతి యువకుడి చరిత్రలోనూ, నిరుద్యోగ పర్వం తప్పదేమో! కానీ, ఎవరూ నా అంత దరిద్రంగా ఉండకూడదని నే నెల్లప్పుడూ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉంటాను.

నాకు మొదట్లో అడుక్కోవడంకూడా వచ్చేది కాదు. కాని, రాను రాను ఆ విద్యను నేర్చుకోక తప్పలేదు.

మీ లాంటి అమాయకుల్ని వెతికేవాణ్ణి. అందరికీ మీకు చెప్పిన కథే చెప్పేవాణ్ణి. పోస్టాఫీసులు, టెలిగ్రాఫ్ ఆఫీసులు వీలైనంత దూరంగా ఉండేటట్లు చూసుకునేవాణ్ణి. అయినా, కొందరు నిజంగా నే నే చెప్పిన తప్పుడు అడ్రసుకి టెలిగ్రామ్ ఇస్తూంటే ఆ పరిస్థితిలో నా మీద నాకే కోపం వచ్చేది.

ఈ విధంగా చాలామందిని మోసం చేశాను. చాలా ఆశ్చర్యంగా ఉంది కదండీ మీకు. కాని, నా అవసర సమయంలో ఆదుకొన్న వాళ్ళ నందర్నీ నేను మర్చిపోలేదు, సర్!

తరువాత నాకు వచ్చిన ఉద్యోగం నా మీద ఉన్న బరువు బాధ్యతలకు సరితూగదు. కాని, మీ అందరి డబ్బూ మీకు పంపటం నా కనీస విధిగా భావిస్తున్నాను.

ఈ పది రూపాయలు మీకు లెక్క లేకపోవచ్చు... అడ్రసు చాలా పాతదైనందువల్ల అసలు అందుతాయో, అందవో... అయినప్పటికీ డబ్బులు మీకు పంపేస్తానన్న నా అప్పటి ప్రామిస్ నిలబెట్టుకుంటున్నందుకు మహదానందంగా ఉంది. బెటర్ లేట్ దాన్ నెవర్!

కృతజ్ఞతలతో
మోహన్.'

ఉత్తరాన్ని మడిచి పక్కన పెట్టాడు రామారావు.

"అన్నట్లు ఒక పది రూపాయలు మనీయార్డర్ కూడా వచ్చింది. బాబు ఫీజ్‌కి పది రూపాయలు చాల్లేదు. ఎలా కట్టాలా అని సతమత మౌతున్నప్పుడు సరిగ్గా అందింది" అంటూ రామారావుకి కాఫీ అందించింది సుశీల. *